క్లుప్తంగా

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేస్తున్న ప్రభాస్ అభిమానులు

తలకొండపల్లి: ప్రముఖ నటుడు ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఆయన అభిమానులు మండల పరిధి వెల్జాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులు, మహిళలు, పిల్లలకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రభాస్ అభిమాన అసోసియేషన్ నాయకులు వెంకటేశ్, శేఖర్, విష్ణువర్ధన్, ఆంజనేయులు, స్వామిగౌడ్, భరత్, నరేశ్, విజయ్, ప్రకాష్, పవన్, శ్రీకాంత్, శివ, రమేష్, నాని, రాఘవేందర్ గౌడ్, విష్ణు, విజయ్ యాదవ్ పాల్గొన్నారు.

వాలీబాల్‌లో సత్తాచాటిన ఆమనగల్లు టీం



విజేత జట్టుతో సీఐ, టోర్నీ నిర్వాహకులు

ఆమనగల్లు: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్–14 విభాగంలో ఆమనగల్లు జట్టు సత్తాచాటింది. శంకరపల్లిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి టోర్నీలో.. కడ్తాల్ జోనల్ నుంచి పాల్గొన్న పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజేత జట్టుకు మంగళవారం డీఈఓ సుశీందర్‌రావ్, సీఐ వీరబాబులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ శ్రీనివాసులు అభినందించారు.

నూతన నియామకం



నియామకపత్రం అందుకుంటున్న కిషన్‌గుప్తా

మీర్‌పేట: ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా కార్పొరేషన్ ఆర్‌ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వనపర్తి కిషన్‌గుప్తా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌గుప్తా మాట్లాడుతూ.. నగరంలో జరిగిన కార్యక్రమంలో తనను గౌరవ సలహాదారుడిగా ఎంపిక చేశారని తెలిపారు. ఫొటో, వీడియో గ్రాఫర్స్ అభివృద్ధికి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనను ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కె.హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి భీమిడి మాధవిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలత



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ హేమలత

తుక్కుగూడ: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత రాజుగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమౌని రాజు, పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

మొయినాబాద్‌రూరల్: చదవడం, నేర్చుకోవడంలో వయస్సుకు పరిమితం లేదని, పట్టుదల, కృషి ఉంటే దేనినైనా సాధించగలరని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సీ.హెచ్.వీ.పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు అన్నారు. హిమాయత్‌నగర్ సమీపంలోని యూనివర్సిటీలో వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగంలో ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ క్లైమెట్ ఆఫ్ ఆర్గనైజేషన్ అనే అంశంపై మేఘశ్యామల పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో పి.శ్యామలకు యూనివర్సిటీ కులపతి పురుషోత్తంరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డిలు ఆమెకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సాత్వికరెడ్డి ఉన్నారు.

హైటెన్షన్ అలైన్‌మెంట్‌ను మార్చండి

- లేదంటే రోడ్డున పడతాం
- ఆవేదన వ్యక్తంచేసిన రైతులు
- కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేత



కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

కడ్తాల్: మండల కేంద్రానికి సమీపంలో వేయనున్న 765 కేవీ విద్యుత్ హైటెన్షన్ పోల్ సర్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చాలని మండల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కందుకూరు ఆర్డీఓ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు, నాయకులు మాట్లాడుతూ.. మండల కేంద్రం సమీపంలోని సన్న చిన్న కారు రైతుల పొలాల మీదుగా బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ అథారిటీ వారు బళ్లారీ నుంచి మహేశ్వరం మీదుగా మీర్ఖాన్‌పేట్ వరకు హైటెన్షన్ లైన్ వేసేందుకు పోల్స్ వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రాంత రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సర్వేచేసి, లైన్ అలైన్‌మెంట్ మార్కింగ్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఇప్పటికే మూడు లైన్లు..

మండల కేంద్రం మీదుగా గతంలో మూడు భారీ పవర్ గ్రిడ్ హైటెన్షన్ లైన్లు తీశారని, ఇప్పుడు మరో లైన్ వేయడం వలన రోడ్డున పడతాయని రైతులు వాపోయారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రానికి 5 కి.మీ దూరంలో అగ్రికల్చర్ జోన్, ప్రభుత్వ భూములు ఉన్నాయని, వెంటనే హైటెన్షన్ పోల్ సర్వే అలైన్ మెంట్‌ను అక్కడికి మార్చాలని కోరారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు రామకృష్ణ, జంగారెడ్డి, రైతులు రాములు యాదవ్, పెంటారెడ్డి, జంగయ్య యాదవ్, గణేశ్, యాదయ్యగౌడ్, మల్లేశ్‌గౌడ్, అంజయ్య, రవి, మల్లేశ్, రాజేశ్, శ్రీనివాస్‌జీ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి అభివృద్ధే ధ్యేయం



నిధుల మంజూరు పత్రాన్ని సంఘం నాయకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- విమర్శలు మానండి.. కలిసికట్టుగా పనిచేద్దాం రండి
- ప్రతిపక్ష నేతలకు పిలుపు

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రతిపక్ష నేతలు విమర్శలు మాని, అభివృద్ధికోసం కలిసిరావాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, పూసల సంఘం ఆమనగల్లు నాయకులు సత్యం, నర్సింహ, వెంకటేశ్ తదితరులు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సత్కరించారు. ఆమనగల్లు పట్టణంలో పూసల సంఘం భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని నేతలు కోరగా.. ఎమ్మెల్యే వెంటనే రూ.5 లక్షలు మంజూరు చేశారు. సంబధిత ఉత్తర్వులను సంఘం నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కల్వకుర్తిలో రోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు శెట్టిపల్లి సత్యం, సంఘం నాయకులు మోహన్, నరేందర్, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధి గానుగుమార్లతండాకు చెందిన అంగోతు చందు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఇందులో మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, నాయకులు పాండునాయక్, శ్రీనునాయక్, గోప్యానాయక్, బీమన్‌నాయక్, కిషన్, మోత్యా, శంకర్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



ప్లాస్టిక్ కవర్లను సేకరిస్తున్న విద్యార్థులు

కందుకూరు: మండలంలోని కొత్తగూడ పరిధి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనార్థాలపై జిల్లా స్పోర్ట్స్, యూత్ అధికారి ఐసయ్య బుధవారం అవగాహన కల్పించారు. కొత్తగూడ చౌరస్తా పరిసరాల్లో పేరుకు పోయిన ప్లాస్టిక్‌ను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోలేదని, దీంతో భూమి, నీరు కలుషితమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ మండల కార్యదర్శి తులసిగారి నర్సింహ డిమాండ్ చేశారు. బుధవారం సిబ్బందితో కలిసి వినతిపత్రం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కార్మికులు మరణిస్తే దహన ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు తక్షణ సాయం చేయాలని పేర్కొన్నారు. కార్మికులకు రేయిన్‌కోర్టులు, సబ్బులు, స్వెటర్లు, బట్టలు కొబ్బరి నూనె తదితర వాటిని పంపిణీ చేయాలని, రాత్రి వేల విధులు నిర్వహించే వారికి అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, బాలు, రమేష్, కుమార్, సహదేవ్, యాదయ్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత



నోటీసులు అందజేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఈ నెల 25న హైదరాబాద్‌లోని సీడీఎంఏ ఆఫీస్ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ధర్నా నోటీసును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీఓ నం.1037లో ప్రతిపాదనలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేశ్, రాములు, శ్రవణ్ ఉన్నారు.

లింకురోడ్లు.. ప్రమాదాలకు నెలవు

అధ్వానంగా పల్లెల రహదారులు



ఆరుట్ల- చాంద్‌ఖాన్‌గూడ లింకు రోడ్డు దుస్థితి

మంచాల: గ్రామీణ ప్రాంతాల లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. బీటీరోడ్లే అయినా.. పూర్తిగా గోతులు ఏర్పడి వాహనదారులు, ప్రయాణికులకు చుక్కలు చూపెడుతున్నాయి. మంచాల మండలం ఆరుట్ల- ఎల్లమ్మతండా, చాంద్‌ఖాన్ గూడ- ఆరుట్ల, ఆగాపల్లి- నోముల లింకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనాలు కూడా ముందుకు వెళ్లలేని దుస్థితి. ఇక నిత్యం వందల కొద్ది వాహనాలు రాకపోకలు సాగించే ఆగాపల్లి- నోముల దారి కంకర తేలి.. ప్రమాదాలకు నెలవుగా మారిందని, రాత్రి పూట ఈ రోడ్డుపై ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్లను పట్టించుకునే వారు కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లింకురోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే విషయంపై పంచాయతీ రాజ్ శాఖ అధికారిని వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

పశువులకు టీకా తప్పనిసరి



షాబాద్: కేసారంలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ స్రవంతి

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో బుధవారం గాలికుంటు నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 196 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయించాలన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: పాడిరైతులు పశుపోషణలో తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కేసారం, నాగర్‌కుంట గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

కీళ్ల సమస్యలపై అవగాహన

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామంలో బుధవారం జిమ్స్ ఆస్పత్రి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పిల్లల ఎముకలు, కీళ్ల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామ పంచాయతీ భవనం వద్ద గర్భిణులు, బాలింతలకు కీళ్ల సమస్యలపై వైద్యులు పలు సలహాలు ఇచ్చారు. కాల్షియం లోపంతో ఎముకల రుగ్మతలు వస్తాయన్నారు. ఎముకలు, కీళ్ల సంబంధిత లక్షణాలను పరీక్షల ద్వారా గుర్తించి, తగిన చికిత్స పొందాలని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు సమీరా, సుచి, లహరి, రుబియా, అభినయ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ శమంత, అంగన్‌వాడీ టీచర్లు శశికళ, శివలీల, గ్రామ మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి శ్రీనివాసులు, ఏఎన్‌ఎం వీణ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు సమయపాలన పాటించాలి

- చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి
- తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు
- ఎంపీడీఓ కుసుమ మాధురి



పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ కుసుమ మాధురి

ఆమనగల్లు: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించేలా పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం మండల పరిధి మేడిగడ్డతండాలో ఆమె పర్యటించారు. తొలుత ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. వాటర్‌ట్యాంక్ ఎక్కి, నీటిని పరిశీలించి మాట్లాడారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదని, సకాలంలో పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వాటర్‌ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంచేసి, బ్లీచింగ్‌పౌడర్ వేయాలని సూచించారు. నర్సరీలో ఈ ఏడాది అదనంగా పదివేల మొక్కలను పెంచాలన్నారు. ఎంఈఓ పాండు, గ్రామ కార్యదర్శి వెంకటయ్య, ప్రధానోపాధ్యాయురాలు స్వప్నారెడ్డి, ఉపాధ్యాయురాలు సంతోషి, మిషన్ భగీరథ ఏఈ వాగ్దేవి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ రవీందర్, నాయకులు విజయ్‌రాథోడ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ ప్రగతి

- మండలంలో 10వేల సభ్యత్వాలు నమోదు
- పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నేతలు

తలకొండపల్లి: బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి, తలకొండపల్లి మండల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బక్కి కుమార్ అన్నారు. పార్టీ చేపడుతున్న సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదుకు ఈ నెల 25వ తేదీ చివరి గడువన్నారు. సభ్యత్వం 100 పూర్తి చేయని వారు త్వరగా పూర్తిచేసి, క్రియాశీలక సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళా శ్రేణులు కనీసం 25 నుంచి 30 వరకు సభ్యత్వాలు నమోదు చేయించినట్లయితే క్రియాశీలక సభ్యత్వానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఇప్పటి వరకు మండంలో 10 వేలకు పైగా సభ్యత్వాలు నమోదు చేశామని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు.. అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా డాక్టర్ సెల్ కో కన్వీనర్ ప్రసాద్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి



వాటర్ ట్యాంక్‌ను బహూకరిస్తున్న లయన్ ప్రతినిధులు తదితరులు

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

తలకొండపల్లి: ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధి చుక్కాపూర్ ప్రాథమిక పాఠశాలకు వీరబొమ్మ నారాయణ, లింగమ్మల జ్ఞాపకార్థం లయన్స్ సభ్యులు భిక్షపతి, రామ్మోహన్‌లు రూ.6వేల విలువైన వాటర్ ట్యాంకును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండుకు అందజేశారు. ఈ సందర్భంగా లయన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉంటుందని, దేశానికి ఉపయోగపడే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థులు రాణిస్తున్నారంటే, వారి వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో దాగి ఉందని పేర్కొన్నారు. ప్రతిభ గల నిరుపేద విద్యార్థులను మా దృష్టికి తీసుకురావాలని, వారి ఉన్నత చదువులకు తగిన విధంగా ఆర్థిక సహాయం అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్ కో ఆర్డినేటర్ రామ్‌రెడ్డి, జిల్లా చైర్మన్‌లు ఎం.చంద్రశేఖర్, ఎం.అంజయ్య గుప్తా, ఓంకారం, సభ్యులు మోహన్ రెడ్డి, ఏమిరెడ్డి పాండురంగా రెడ్డి, శేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య, తిరుపతి రెడ్డి, రామ్మోహన్ క్లబ్ పీఆర్ఓ పాష తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన.. ఆనందమయ జీవనం



చండీయాగం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి తదితరులు

డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహద పడతాయని, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకున్న వారి జీవనం ఆనందమయంగా కొనసాగుతుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రంలో బుధవారం గంగాపురం పీఠాధిపతి పరమాత్మనందగిరి స్వామిజీ పర్యటించారు. ఈ సందర్భంగా నవంబర్ 15 నుంచి 17 వరకు గంగాపురం ఆశ్రమంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీరుద్ర సహిత శత చండీయాగం సన్నాహక సమావేశం నిర్వహించారు. యాగం విజయవంతంపై భక్తులతో చర్చించారు. కార్యక్రమ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం పీఠాధిపతిని స్థానికులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆశ్రమ ఇన్‌చార్జి వెంకటచరణ గురుస్వామి, స్థానికులు గంప రాములు, అంజయ్య, మల్లప్ప, రాము, మోహన్, వీరేంద్ర, సాయిరెడ్డి, చెన్నయ్య. పద్మాకర్ రెడ్డి, హరి తదితరులు ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధి 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకానికి అదనంగా తులం బంగారం ఇస్తానని కాంగ్రెస్ ప్రకటించిందని, అది ఏమైందని ప్రశ్నించారు. రైతులకు రైతు భరోసా కింద రూ.15వేలు, మహిళలకు నెలకు రూ.2500 చొప్పున పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు తిరిగి భూములను అప్పగించాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిర, డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, పి.ఆనంద్, మాజీ ప్రజాప్రతినిధులు ఇందిరా దశరథ, కె.రామకృష్ణారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, దేవేందర్, గోవర్ధన్, కె.రాములు, ఎస్.రాజశేఖర్ రెడ్డి, ఎం.బాబు, జంగయ్య, సీనియర్ నాయకులు జి.లక్ష్మీనర్సింహరెడ్డి, దశరథ, జయమ్మరాజు, కుమార్, దామోదర్‌గౌడ్, అశోక్, ప్రకాశ్‌రెడ్డి, సామయ్య, కార్తీక్, దర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, వెంకటేశ్, దీక్షిత్‌రెడ్డి, శ్రీహరి, రామకృష్ణ, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.